


# Black Saturday

**దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!**

సృష్టికర్త అయిన యేసుక్రీస్తు మనుష్యుల పాపమును కడుగుట కొరకు మనుష్యుల పోలిక చొప్పున భూమిమీద జన్మించినారు.

ఫిలిప్పీ 2 : 7 మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను.

మనకోసము ప్రాణము పెట్టునంతగా విధేయత చూపించినారు. ఆయన శారీరకముగా 33 ½ సంవత్సరములు మనమధ్య జీవించినారు. ఆయన అనుదినము జనుల మధ్యవున్నారు. బీదలకు సువార్త ప్రకటించినారు, రోగులను స్వస్థపరచినారు, చనిపోయిన వారిని లేవనెత్తినారు..............చివరకు గురువారము రాత్రి గెత్సేమనే తోట నుండి భరించలేనంత శ్రమల గుండా వెళ్ళినారు. శుక్రవారము ఉదయమున 9 గంటలకు సిలువ వేయబడ్డారు. మధ్యాహ్నము 3 గంటలకు తండ్రికి, తన ఆత్మను అప్పగించినారు. యేసుక్రీస్తు వారు తిరిగి ఆదివారము ఉదయము తెల్లవారు జామున అనేకులకు అగుపడినారు. ఇదంతా ప్రపంచానికి తెరచిన పుస్తకమే. కాని శుక్రవారము సాయంత్రము నుండి ఆదివారము ఉదయము వరకు మధ్య యేసుక్రీస్తు వారు ఎక్కడ వున్నారు? ఏమి చేసినారు? అనే ప్రశ్నలు చాలా మంది మదిలో ఉండివుండవచ్చు. ఆ ప్రశ్నకు సమాధానమే ఈ BLACK SATURDAY.

సృష్టికర్త అయిన దేవుడు, సృష్టిని ఒక్కొక్క దినమందు కొంత సృష్టి చేస్తూ వచ్చారు. ఒక అస్తమయము, ఉదయము కలుగగా ఒక దినము అని చెప్పవచ్చు. yom (యోమ్)అనగా హీబ్రూ భాషలో దినము అని అర్థము. 6 దినములు సృష్టిని చేసి 7వ దినమును విశ్రాంతి దినముగా ప్రకటించినాడు. అంటే ఆ దినమందు ఏమి చేయకూడదు. అన్నిటి నుండి విశ్రాంతి తీసుకోవాలని అర్థము. ఈ 7దినములలో ప్రతిదినము దాని దాని ప్రత్యేకతను కలిగివున్నాయి. ఇప్పటి వాడుక భాష మరియు హీబ్రూ భాషలో 7దినములను క్రింది పేర్లతో పిలుస్తారు.

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
|---|---|---|---|---|---|---|
| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | బేస్తవారము | శుక్రవారము | శనివారము |
| యోమ్ రిషోన్ | యోమ్ షెని | యోమ్ శ్లిషి | యోమ్ రెవిహి | యోమ్ ఖమిషి | యోమ్ షిషి | యోమ్ సబాథ్ |
| | | | | | సిద్ధపాటు | విశ్రాంతి |

ఇక్కడ శుక్రవారము సిద్ధపాటు దినము అని, శనివారము విశ్రాంతి దినము అని మనము గమనించాలి (మార్కు15:42). పాతనిబంధన కాలములో శనివారమును విశ్రాంతిదినముగా ఆచరిస్తారు. 6వ దినమున అంటే శుక్రవారమునాడు మనిషిని చేసినారు. మరల శుక్రవారము నాడే మనిషి కొరకు ప్రాణము పెట్టినారు. పాతనిబంధన కాలము వారికి శనివారము విశ్రాంతి దినముగా చేసినారు. మరల శనివారము నాడే పాతాళములో వున్న వారికి విశ్రాంతి దయచేసినారు. దేవుడు ఏమి చేసినా ఎంతో ప్రణాళికతో చేస్తారు.

పాతనిబంధన వాళ్ళకి ధర్మశాస్త్రము, దాని rules మరియు దాని regulations బాగా తెలుసు. పస్కాగురించి గురించి ఇంకా బాగా తెలుసు. యేసుక్రీస్తే ఆ పస్కాబలి పశువు అని ఇంకా అర్ధము కాలేదు. అర్ధము కావాలంటే సువార్త ప్రకటించాలి. ప్రకటించాలి అంటే మొదట ఆయన పాతాళమునకు దిగిపోవాలి. తరువాత యేసుక్రీస్తు ఆయన ఎట్లా బలిపశువో వివరించాలి. అది విన్న తరువాత గాని జనులు ఆయనను అంగీకరించరు. అప్పుడు ఎందరు తనను అంగీకరించినారో వారందరికి దేవుని కుమారులు అయ్యే అవకాశము కల్పించినారు. ఈ రోజుకీ యేసుక్రీస్తే పస్కా బలిపశువు అని నమ్మని యూదులు, రబ్బాయిలు వున్నారు. వాళ్లు కొన్ని లేఖనాలను వక్రీకరించి వాదిస్తుంటారు.

**1. పాతాళములోని పాతనిబంధన కాలము వారిని విడిపించుటకు యేసుక్రీస్తు పాతాళమునకు దిగిపోయెను:**

ఎఫెస్సి 4: 9 **ఆరోహణమాయెననగా ఆయన భూమి యొక్క క్రింది భాగములకు దిగెననియు అర్థమిచ్చుచున్నది గదా.** పై లేఖన భాగాన్ని గమనిస్తే యేసుక్రీస్తు వారు మొదట పాతాళమునకు దిగిపోయెనని స్పష్టముగా అర్థము అవుతుంది.

John(యోహాను సువార్త) 1:12,13 - **తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను.**
**వారు దేవుని వలన పుట్టినవారే గాని, రక్తము వలననైనను, శరీరేచ్ఛ వలననైనను, మనుషేచ్ఛ వలననైనను పుట్టిన వారు కారు.**

**యేసుక్రీస్తుని పాతనిబంధన కాలము వారు అనేకులు అంగీకరించిరి :-**

**ఉదా1: కీర్తన 110:1 ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు అని దావీదు ఒప్పుకుంటున్నాడు.**

**ఉదా2: బిలాము యేసుక్రీస్తువారి నక్షత్రమును చూచి క్రీస్తుని అంగీకరిస్తున్నాడు.**

Ephesians(ఎఫెసీయులకు) 4:8 -13 - అందుచేత **ఆయన(యేసుక్రీస్తు) ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొనిపోయి** మనష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది. **ఆరోహణమాయెననగా ఆయన భూమియొక్క క్రింది భాగములకు(కొన్ని ప్రాచీన ప్రతులలో-మొదట అని కూర్చబడియున్నది) దిగెననియు అర్థమిచ్చుచున్నదిగదా.**
**దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలములన్నిటికంటె మరి పైకి ఆరోహణమైనవాడునై యున్నాడు.** మనమందరము **విశ్వాస విషయములోను దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములోను ఏకత్వము పొంది సంపూర్ణ పురుషులమగువరకు,** అనగా **క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు,** ఆయన ఈలాగు నియమించెను. **పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులనుగాను ఉపదేశకులనుగాను నియమించెను.**

2. **యేసుక్రీస్తు వారు పాతాళములో సువార్త ప్రకటించారు:-** 1 Peter(మొదటి పేతురు) 3:19-22

**ఆత్మవిషయములో బ్రదికింపబడి,** పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. దేవుని దీర్ఘశాంతము ఇంక కని పెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారియొద్దకు, అనగా **చెరలో ఉన్న ఆత్మలయొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను.** ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణపొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదు గాని **యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే. ఆయన పరలోకమునకు వెళ్లి దూతల మీదను అధికారుల మీదను శక్తులమీదను అధికారము పొందినవాడై దేవుని కుడిపార్శ్వమున ఉన్నాడు.**

లూకా 19: 10 నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను.

**సువార్త అంటే నశించిన దానిని వెదకి రక్షించుట అని, అందుకోసమే యేసుక్రీస్తు లోకమునకు వచ్చాడు అని పై లేఖనమును బట్టి మనకు అర్ధము అవుతుంది.**

3. **ఆయనే పస్కా బలి పశువుగా కనుపరుచుకున్నారు:**

ఎఫెస్సి1:7 దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది.

I కొరింథీ 5: 7 మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతే కాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను.

**ఇక్కడ మనము గమనించినట్లైతే ఆయన రక్తము ద్వారా మాత్రామే మనకు విమోచన కలుగుతుంది అని మనకు అర్ధము అవుతుంది. ఆయన రక్తము చిందించాలి అంటే ఆయనను వధించాలి. అందుకే ఆయన పస్కా బలిపశువుగా మారినారు.**

**గాయములు చూపించినారు : 3 ½ సంవత్సరములు యేసుక్రీస్తుతో తిరిగి పరిచర్య నేర్చుకొని అద్భుతములు చూచి మరియు చేసిన తోమా యేసుక్రీస్తు గాయములు చూచిగాని నమ్మలేదు.మరి పాతాళములో ఆయనను చూడక నమ్మని వారు ఎంతమందో. అందుకే ఆయన తల రుమాలు సమాదిదగ్గర విడిచిపెట్టినాడు. అప్పుడు మాత్రమే తలకు కలిగిన గాయములు కనబడుతాయి. ఆయన పంచ గాయములను కప్పి ఉంచే వస్త్రాలను సమాధిలోనే ఉంచాడు.**

4. **రక్తాన్ని ప్రోక్షించినారు :**

**హెబ్రీ 9: 22 - రక్తము చిందింపకుండా పాప క్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును.**

**పాతనిబంధన కాలములో పాపము కొరకు ప్రాయశ్చిత్తముగ బలిని ఇచ్చేవారు కదా అని మీరు అడుగవచ్చు. ప్రాయశ్చిత్త దినము నాడు పాపము పోయివుంటుంది కదా అన్న ప్రశ్న మీకు రావచ్చు. పాతనిబంధనలోని ఏ బలికి ప్రాయశ్చిత్తము జరగలేదు ఆ సమయము లో పాపము కేవలము కప్పబడినది. కఫార్ అంటారు అంటే 'కప్పిపుచ్చడము' లేదా 'మూసివేయడము' అని అర్ధము. పాతనిబంధన కాలములోని పాపములు కప్పి**

వుంచబడ్డాయి. అందుకే వారందరు పాతాళములో కప్పి వుంచబడ్డారు. కాని పాప విమోచన మాత్రము యేసుక్రీస్తు రక్తము ద్వారా మాత్రమే సాధ్యము అందుకే ఆయన పాతాళమునకు దిగి సువార్త చెప్పి, రక్తమును ప్రోక్షించినారు. హీబ్రూ భాషలో zaraq / nazah అనగా ప్రోక్షించటము లేదా చల్లటము అని అర్థము.

హెబ్రీ 9 : 14- నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించు కొనినక్రీస్తుయొక్క రక్తము, **నిర్జీవక్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును.**

**ఆయన రక్తానికి మనస్సాక్షిని కూడా శుద్ధి చేసే లక్షణము వుంది. శుద్ధిగా లేని వారి హృదయాలను ఆయన రక్తము ద్వారా శుద్ధి చేసినారు. ఎలాగంటే ఆయన రక్త ప్రోక్షణ ద్వారా మాత్రమే అది సాధ్యము.**

హెబ్రీ 9 : 20 - దేవుడు మీకొరకు విధించిన నిబంధన రక్తమిదే అని చెప్పుచు గ్రంథముమీదను ప్రజలందరి మీదను ప్రోక్షించెను.

హెబ్రీ 12 : 24 - క్రొత్తనిబంధనకు మధ్య వర్తియైన యేసునొద్దకును హేబెలుకంటె మరి శ్రేష్ఠముగ పలుకు ప్రోక్షణ రక్తమునకును మీరు వచ్చియున్నారు.

I యోహాను 5: 5-7 యేసు దేవుని కుమారుడని నమ్ము వాడు తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు? నీళ్లద్వారాను రక్తముద్వారాను వచ్చిన వాడు ఈయనే, అనగా యేసుక్రీస్తే. ఈయన నీళ్లతో మాత్రమేగాక నీళ్లతోను రక్తముతోను వచ్చెను. ఆత్మ సత్యము గనుక సాక్ష్యమిచ్చువాడు ఆత్మయే.
సాక్ష్య మిచ్చువారు ముగ్గురు, **అనగా ఆత్మయు, నీళ్లును,రక్తమును, ఈ ముగ్గురు ఏకీభవించి యున్నారు. యేసుక్రీస్తు రక్తము ద్వారా మాత్రమే పాప క్షమాపణ జరుగుతుంది. కావున ఆయన చిందించిన రక్తము పాతాళములో ఉన్నవారి మీద ప్రోక్షించి వారిని పాతాళము నుండి విడుదల చేసినారు.**

## 5. పాతాళము నుండి తప్పించి చెరను చెరగా పట్టుకొనిపోయెను:

Ephesians(ఎఫెసీయులకు) 4:8 - అందుచేత **ఆయన(యేసుక్రీస్తు) ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొనిపోయి** మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది. **దేవుడు చెరలో ఉన్నవారిని విడిపించినాడు. యేసుక్రీస్తు వారు ఆయన గురించి చెప్పబడిన ప్రతి ప్రవచనాన్ని నెరవేర్చినారు. చెరనుండి ఆయన అనేకులను విడిపిస్తారు అని కీర్తనలలో చెప్పిన ప్రవచనాలను నెరవేర్చినారు.**

కీర్తన 85:1 : యెహోవా, నీవు నీ దేశము ఎడల కటాక్షము చూపి యున్నావు చెరకుపోయిన యాకోబు సంతతిని నీవు వెనుకకు రప్పించియున్నావు.

కీర్తన 14 : 7 : సీయోనులోనుండి ఇశ్రాయేలునకు రక్షణ కలుగునుగాక. యెహోవా చెరలోని తన ప్రజలను రప్పించునప్పుడు యాకోబు హర్షించును, ఇశ్రాయేలు సంతోషించును

6. **పాతాళము నుండి తప్పించి సిలువ జయోత్సవములో పాలిభాగస్తులను చేసినారు:**

**Colossians(కొలొస్సయులకు) 2:13,14,15** - మరియు **అపరాధముల వలనను, శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను, మీరు మృతులైయుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను తుడిచివేసి,మనకు అడ్డములేకుండ దానిని ఎత్తి వేసి మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను;**ఆయన ప్రధానులను, అధికారులను, నిరాయుధులనుగా చేసి, **సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను.**

**ఎఫెస్సి 4:8** అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొనిపోయి మనష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది.

**కల్వరిసిలువలో సాతాను తలను చితకకొట్టిన ఆయన , ఆ విజయములో అందరిని పాలిభాగస్తులను చేయుటకొరకు ఆయన పాతాళములోకి దిగి సువార్త చెప్పి, రక్తాన్ని ప్రోక్షించి సిలువ జయోత్సవములో పాలి భాగస్తులనుగా చేసినారు.**

7. **పరిశుద్ధులతో ఏక పట్టణస్థులను చేసినారు:** **Ephesians(ఎఫెసీయులకు) 2:19-22**-కాబట్టి **మీరికమీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునైయున్నారు క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియైయుండగా** అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి **ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయ మగుటకు వృద్ధిపొందుచున్నది.** ఆయనలో మీరు కూడ **ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమైయుండుటకు కట్టబడుచున్నారు.**

**ముగింపు : రానున్న దినాలలో మనలను కూడా తీసుకు వెళ్తారు :**

**1 Thessalonians(మొదటి థెస్సలొనీకయులకు,) 4:14-17** -**యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల,** అదే ప్రకారము **యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును.** మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, **ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద(మేఘములయందు) కొనిపోబడుదుము.** కాగా మనము **సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము.**




మత్తయి 11:28 **ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగ జేతును.** అని వాగ్ధానము చేసిన యేసయ్య అందరికీ విశ్రాంతి దయచేస్తారు. అందుకోసమే అయన కల్వరి శ్రమలను అనుభవించి పాతాళములోని వారిని విడిపించారు. ఆయన **2**వ రాకడలో మనమూ విడిపించబడతాము. అందులకై సిద్ధపడుదాము. మన మందిరాల్లో, ఈ నలబై రోజుల్లో, Lent లో...

YESHUA BLESS YOU ALL